సాక్షి
మంచిర్యాల
సోమవారం । 16 । అక్టోబర్ । 2023






బీఫామ్ అందుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఫాంలు పంపిణీ చేశారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్ నుంచి పోటీ చేసే అభ్యర్థులు నడిపెల్లి దివాకర్‌రావు, చిన్నయ్య, బాల్క సుమన్, జాన్సన్ నాయక్ కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకున్నారు.

- మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి/చెన్నూర్/ఖానాపూర్

న్యూస్‌రీల్

కనీస పెన్షన్ పథకం అమలు చేయాలి

- తెలంగాణ ఆల్ పెన్షనర్ల సంఘం నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పాతమంచిర్యాల: పెన్షనర్లకు కనీస పెన్షన్ పథకం అమలు చేసి కరువుభత్యం ఇవ్వాలని, ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకుండా హెల్త్ స్కీం అమలు చేయాలని పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. జిల్లా కేంద్రంలోని హరిత ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఈపీఎఫ్, పెన్షన్లు, సింగరేణి కార్మికుల పెన్షన్‌ను రూ.15 వేలుగా నిర్ణయించాలని, మూడు నెలలకు ఒకసారి కరువు భత్యం మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ రంగయ్య, నాయకులు ఎస్వీ నరసింహారావు, వెంకటస్వామి, కోశాధికారి శంకరయ్య, భువనగిరి రాజిరెడ్డి, కుమారస్వామి, పాండురంగా తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు మద్దతు ఇస్తా



మాట్లాడుతున్న గోనె ప్రకాశ్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేవారిలో బీసీలకు టికెట్ ఇచ్చే పార్టీకి తాను మద్దతు ఇస్తానని, గతంలోనే హామీని ఇచ్చినట్లుగా తన భూమిని అమ్మి డబ్బులు ఇస్తానని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివా రం మాట్లాడారు. మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఇప్పటికే ఖరారు చేశారన్నారు. మంచిర్యాలలో బీజేపీ నుంచి రఘునాథ్ వెరబెల్లికిగానీ, బీసీ అభ్యర్థికి టికెట్ ఇచ్చే అవకాశం ఉందన్నారు. బెల్లంపల్లిలో గడ్డం వినోద్ ఎన్ని కల సమయంలోనే వస్తున్నారని, కొన్ని తప్పిదాలు చేసిన దుర్గం చిన్నయ్య మాత్రం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ఆయన్నే గెలిపించాలని కోరారు. గుండా రాజకీయాలను ప్రోత్సహించొద్దని కోరారు.

నల్లబ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

రామకృష్ణాపూర్: జర్నలిస్టులనుద్దేశించి ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా క్యాతనపల్లి క్రాస్‌రోడ్ వద్ద స్థానిక జర్నలిస్టులు ఆది వారం సాయంత్రం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలుపుతామని, బీఆర్ఎస్ వార్తలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. జర్నలిస్టుల నిరసన వద్దకు చేరుకున్న ఇద్దరు యువకులు హంగామా సృష్టించారు. మద్యం మత్తులో ఉన్న సదరు యువకులు తాము బాల్కసుమన్ అనుచరులమని ముగ్గురు జర్నలిస్టులపై భౌతిక దాడి చేశారు. యువకుల దాడిపై జర్నలిస్టులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్ ఫిర్యాదుకు స్పందిస్తూ జరిగిన దాడిపై విచారణ జరిపి యువకులపై చర్య తీసుకుంటామని తెలిపారు.

ఫస్ట్ లిస్ట్‌లో ముగ్గురే!



- కాంగ్రెస్ తొలి జాబితాలో మూడు టికెట్లు
- ఉమ్మడి జిల్లాలో మరో ఏడు చోట్ల పెండింగ్
- కొలిక్కివస్తున్న సీట్ల పంపకం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: దాదాపు నెల రోజులుగా ఊరించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ఫస్ట్‌లిస్ట్ ఎట్టకేలకు విడుదలైంది. ఇందులో ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు కేవలం మూడు నియోజకవర్గాల అభ్యర్థులను మాత్రమే ప్రకటించారు. మిగతా ఏడింటిపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. పెద్దగా పోటీ దారులు లేని మంచిర్యాల, బెల్లంపల్లి, నిర్మల్ టికెట్లు ఫస్ట్‌లిస్ట్‌లోనే ప్రకటించారు. వరుసగా ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, కుచాడి శ్రీహరిరావుకు టికెట్లు ఇచ్చారు. మలి విడత జాబితాలో మిగతా ఏడు టికెట్లు ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈ ఏడు సీట్లలోనే పోటాపోటీగా నాయకులు ఉన్నారు. ఆదిలాబాద్, ముథోల్, ఖానాపూర్, బోథ్, ఆసిఫాబాద్, సిర్పూర్, చెన్నూరు, టికెట్లు ప్రకటించాల్సి ఉంది. దీంతో రెండో జాబితాపై అందరిలో ఆసక్తి నెలకొంది. వీటిలో చెన్నూరును పొత్తులో భాగంగా సీపీఐకి ప్రకటించే అవకాశం ఉంది. మిగిలిన స్థానాల్లో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

బోథ్, ఖానాపూర్‌పై పీటముడి

బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే వారికే టికెట్ ఖాయమని అనుచరవర్గాలు నమ్ముతున్నాయి. అయితే ఇప్పటికే అక్కడ కొంతకాలంగా పనిచేస్తున్న నాయకులు సీట్లపై ఆశలు పెట్టుకున్నారు. వారిని ఎలా బుజ్జగిస్తారనేది సవాల్‌గా మారింది. లేకపోతే ఎమ్మెల్యేలకే టికెట్ ఇవ్వకుండా గెలుపునకు కృషి చేయాలని సూచిస్తే పార్టీలోనే ఉంటారా? లేక వేరే దారి చూసుకుంటారా? అనేది తేలాల్సి ఉంది. బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ ఎస్టీ స్థానాల్లో లంబాడా, ఆదివాసీలతో భర్తీ చేయాల్సి రావడంతో ఎక్కడ ఏ వర్గానికి నిర్ణయించారనేది వెల్లడి కానుంది. మూడింట రెండు కచ్చితంగా ఒకే వర్గానికి ఇవ్వాలి. మరో వర్గానికి ఎంపీ స్థానం ఇచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేఖా నాయక్, రాథోడ్ బాపురావు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉండడంతో ఆచితూచి ఎంపిక జరిగినట్లు నాయకులు చెబుతున్నారు.

అసంతృప్తులు ఏం చేస్తారో?

తొలి జాబితా, మలి జాబితాలో టికెట్ దక్కని అసంతృప్తులు ఏం చేస్తారనేది పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈసారి ఎలాగైనా ఉమ్మడి జిల్లాలో సత్తా చాటాలని హస్తం పార్టీ ఆరాటపడుతున్న నేపథ్యంలో నాయకుల మధ్య సమన్వయంతో ముందుకు వెళ్లడం ముఖ్యం. ఇప్పటికే గ్రూపులుగా ఉన్న నాయకులు టికెట్ల పంపకం తర్వాత మరింత రచ్చకెక్కే అవకాశం లేకపోలేదు. దీంతో అసంతృప్తులు ఏం చేస్తారనేది పార్టీలో చర్చ సాగుతోంది.

గడ్డం వినోద్ బయోడేటా..

బెల్లంపల్లి:
పేరు : గడ్డం వినోద్
తల్లిదండ్రులు: గడ్డం వెంకటస్వామి,కళావతి
భార్య : రమ
కూతురు : వర్ష
జన్మస్థలం : హైదరాబాద్
పుట్టిన తేదీ : 16-09-1956
విద్యార్హత : గ్రాడ్యుయేషన్
హాబీస్ : పుస్తక పఠనం,షెటిల్ బ్యాడ్మింటన్,క్రికెట్ ఆడటం
తెలిసిన భాషలు : తెలుగు, హిందీ, ఇంగ్లిష్
రాజకీయరంగ ప్రవేశం : 1999 సంవత్సరం
తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నిక : 2004లో చెన్నూర్ ఎమ్మెల్యేగా విజయం
నిర్వహించిన పదవి : 2004-2009 వరకు రాష్ట్ర లేబర్, టెక్స్‌టైల్ మంత్రి

ప్రేమ్‌సాగర్‌రావు బయోడేటా..

మంచిర్యాలటౌన్:
పేరు : కొక్కిరాల ప్రేంసాగర్‌రావు
పుట్టిన తేదీ 21-09-1960
విద్యార్హత : ఎంఏ, ఎల్ఎల్‌బీ
తల్లిదండ్రులు కమలమ్మ, రఘుపతిరావు (మాజీ ఎంపీపీ, కాసిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, ఓరియంట్ సిమెంట్ కంపెని గుర్తింపు సంఘం అధ్యక్షుడు)
భార్య : సురేఖ
కుమారుడు, కోడలు ఉదయ్ చరణ్‌రావు -శైలేఖ్య
వృత్తి కన్‌స్ట్రక్షన్స్ అండ్ స్కిల్ గ్రూప్ ఆఫ్ ఇండియా, హోటల్స్
రాజకీయ అనుభవం విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. 1985లో వర్కర్స్ లేబర్ యూనియన్ ప్రెసిడెంట్‌గా, 2000-2003 వరకు పీసీసీ కార్యదర్శిగా, 2005 వరకు పీసీసీ సభ్యులుగా ఉన్నారు. 2004-2006 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు సభ్యులుగా ఉన్నారు. 2005-2007 వరకు డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. 2007-2013 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీగా ఉన్నారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గం నుంచి పోటీ చేసి 4 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు.

గ్యారెంటీ స్కీంలు అమలు చేస్తాం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలను అధికారంలోకి రాగానే నూటికి నూరుశాతం అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోను నూరు శాతం అమలు చేస్తామని కాంగ్రెస్ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ ఎన్నికల వ్యూహ కమిటీ చైర్మన్ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాకాలనీకి చెందిన సీపీఐ, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఆటోస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడారు. కేసీఆర్ మాదిరిగా అమలుకాని హామీలు ఇచ్చే పార్టీ కాంగ్రెస్ కాదన్నారు. ఎన్నికల సమయంలో ఇస్తున్న హామీలన్నీ అమలు చేస్తామన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారికి డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో కలిసి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నస్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి సుధాకర్, నాయకులు రాచకొండ బుజ్జన్న, పూదరి తిరుపతి, ఖాలిద్, దర్ని మధు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ల ఆశలపై నీళ్లు!

- బెల్లంపల్లి కోరితే చెన్నూరు ఆఫర్
- ఆశావహులకూ మొండి 'చేయి'
- పోటీ చేయడంపై కామ్రేడ్ల తర్జనభర్జన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'అడిగింది ఒకటి, ఇచ్చింది మరొకటి అన్నట్లు'గా మారింది జిల్లాలోని కామ్రేడ్ల పరిస్థితి. కాంగ్రెస్, వామపక్షాల పొత్తు జిల్లాలోని ఆ రెండు పార్టీ నాయకులకు ఊహించని షాక్ ఇచ్చింది. సీపీఐ(కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా)కి బెల్లంపల్లి సీటు కావాలని కాంగ్రెస్‌ను కోరితే చెన్నూరు సీటును ఇవ్వడం ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. మొదటి నుంచి బెల్లంపల్లిపైనే ఎర్ర జెండా నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ఇందుకోసం నస్పూర్ పట్టణ కౌన్సిలర్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రే గుంట చంద్రశేఖర్ ఏడాదిన్నరగా పార్టీ బలోపేతానికి ప్రయత్నిస్తున్నారు. జీపు యాత్ర, ఇంటింటి ప్రచారం వంటి కార్యక్రమాలతో ప్రజల్లో ఉ న్నారు. అవసరమైతే సొంతంగా పోటీకి సిద్ధమయ్యారు. కానీ రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్-వామపక్షాల పొత్తులో బెల్లంపల్లికి బదులు చెన్నూరు స్థా నం సీపీఐకి ఆఫర్ చేయడం కామ్రేడ్లకు మింగుడు పడడం లేదు. ఇన్నాళ్లు ఆ నియోజకవర్గంలో చేసి న శ్రమంతా వృథా అయిందని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి ఆసిఫాబాద్ నియోజకవర్గ పునర్విభజన తర్వాత బెల్లంపల్లి నుంచి 2009లో దివంగత నేత గుండా మల్లేశ్ ఎమ్మెల్యేగా గెలిచారు. 2014, 2018లో పోటీ చేసినా ఓటమిపాలయ్యా రు. దీంతో మరోసారి ఇక్కడి నుంచే పోటీ చేయాలని జిల్లా నాయకత్వం భావించింది. అయితే పరి స్థితులు పూర్తిగా తారుమారయ్యాయి.

సుమన్‌ను తట్టుకోగలరా?

బీఆర్ఎస్ అభ్యర్థి చెన్నూరు, ప్రస్తుత ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను కమ్యూనిస్టులు తట్టుకోగలరా? అనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఇక్కడ పార్టీకి నాయకత్వ లేమితోపాటు గ్రామీణ స్థాయిలో పార్టీ ఇంకా విస్తరించి లేదు. మందమర్రి, రామకృష్ణాపూర్ పరిధిలో సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ కార్మిక సంఘ ప్రభావం తప్పితే మిగతా చోట్ల పెద్దగా పార్టీ ప్రభావం లేదు. జైపూర్, చెన్నూరు, కోటపల్లి మండలాల్లో కింది స్థాయిలో కేడర్ లేదు. పోలింగ్‌కు నెలన్నర వ్యవధిలో నియోజకవర్గంలో బలం పెంచుకోవడం సాధ్యమయ్యే పని కాదు. ఇక్కడ పోటీ చేస్తే పూర్తిగా కాంగ్రెస్ పార్టీ ఓట్లపైనే ఆధారపడాలి. ఈ రెండు పార్టీలు కలిసి చెమటోడిస్తేనే ఫలితం దక్కే అవకాశం ఉంది.

కాంగ్రెస్ ఆశావహుల్లో కలవరం..

చెన్నూరు నుంచి పోటీ చేస్తామని బల్లగుద్ది చెప్పిన నాయకులకు పొత్తు పరిణామం కలవరపెడుతోంది. ఇక్కడి నుంచి పోటీకి సిద్ధమైన నాయకులకు గట్టి దెబ్బ తగిలింది. ఈ సీటు పక్కాగా సీపీఐకి ఇస్తే కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారంతా ఏం చేస్తారనేది ఆసక్తిగా మారింది. చెన్నూరు టికెట్ కోసం మాజీ మంత్రి బోడ జనార్దన్‌సహా మరో 13 మంది దరఖాస్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మె ల్యే నల్లాల ఓదెలు, ఆయన సతీమణి జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరి టి కెట్ ఆశించారు. అయితే పొత్తులో సీపీఐకి కేటాయించడంలో వీరంతా ఏం చేస్తారనేది వేచి చూడాలి.

పోటీపై నేడు స్పష్టత

తమ పార్టీ బలంగా లేనిచోట కాంగ్రెస్ టికెట్ ఇవ్వడంపై రాష్ట్ర స్థాయిలో చర్చించి కామ్రేడ్లు ఓ నిర్ణయం తీసుకోనున్నారు. చెన్నూరు నుంచి పోటీ చేయాలా? వద్దా? అనేదానిపై చర్చించనున్నారు. ఈ క్రమంలో సోమవారం పార్టీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయంతోనే స్పష్టత రానుంది. ఒక వేళ కామ్రేడ్లు పోటీ చేయకపోతే కాంగ్రెస్ అవకాశం ఇచ్చిన ఈ సీటును కోల్పోతారు. ఆ సమయంలో ఆ పార్టీ వారికి అవకాశం ఉంటుంది. ఒకవేళ పోటీ చేస్తే ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై విస్తృతంగా చర్చించి ఓ నిర్ణయానికి వస్తామని జిల్లా నాయకులు చెబుతున్నారు.

కేసీఆర్ నియంతృత్వంతోనే ప్రజల్లో వ్యతిరేకత



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వివేక్

బెల్లంపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరిస్తున్న నియంతృత్వ పోకడలతోనే బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని బీజేపీ జాతీయకార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ గడ్డం వివేక్ అన్నారు. బెల్లంపల్లి పోస్టాఫీసు బస్తీలో బీజేపీ పట్టణ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుత పరిణామాలను బేరీజు వేసుకున్న సీఎం కేసీఆర్ ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారం కోల్పోతామనే భయం పట్టుకుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. జర్నలిస్టులపై దురుద్దేశపూర్వకంగా రాష్ట్ర విప్, ఎమ్మెల్యే బాల్కసుమన్ విమర్శించడాన్ని ఖండించారు. జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

యువకుల చేరిక..

కాసిపేట మండలానికి చెందిన యువకులు వివేక్ సమక్షంలో బీజేపీలో చేరారు. కాసిపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరం సంపత్, బూక్య అరవింద్ ఆధ్వర్యంలో యువకులు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.రఘునాథ్, ప్రధాన కార్యదర్శి ముని మంద రమేశ్, పట్టణ అధ్యక్షుడు కోడి రమేశ్ పాల్గొన్నారు.

బకాయిల కోసం పవర్‌ప్లాంట్ కార్మికుల ఆందోళన



నిరసన తెలుపుతున్న పవర్ ప్లాంట్ కార్మికులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల శివారులోని శాలీవాహన గ్రీన్ ఎనర్జీ బయోమాస్ పవర్ ప్లాంట్ కార్మికులు బకాయిలు చెల్లించాలని ప్లాంట్ గేటు ఎదుట ఆదివారం ఆందోళన చేశారు. కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ ప్లాంట్‌ను 2022, డిసెంబర్‌లో మూసివేశారని తెలిపారు. ఏడాది కావొస్తున్నా కార్మికులకు రావాల్సిన వేతనాలు, బోనస్‌లు, గ్రాట్యుటీ, ప్లాంట్ క్లోజింగ్ బెనిఫిట్స్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యంపై కార్మిక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి కార్మికులకు రావాల్సిన వేతనాలు, బోనస్‌లు ఇప్పించాలన్నారు. నిరసనలో శెట్టి శ్రీని వాస్, సత్యనారాయణ, ఆనందరావు, సుధీర్, రవి, శంకర్, రాజయ్య, తిరుపతి, బుచ్చయ్య పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌ను మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనుండగా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వి.రాములు ఆదివారం పరిశీలించారు. ఆయన వెంట ఏసీపీ తిరుపతిరెడ్డి, రిటర్నింగ్ అధికారి ప్రసాద్, సీఐ రాజు, సంజీవ్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ గడియారం శ్రీహరి ఉన్నారు.

వృద్ధులకు ఇంటి నుంచే ఓటు

దివ్యాంగులు, 80 ఏళ్ల దాటిన వారు ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయం ఎన్నికల సంఘం కల్పించిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాములు తెలిపారు. ఇస్లాంపుర కాలనీలో దివ్యాంగులు, వృద్ధులకు ఫారం 12డి పంపిణీ చేశారు.



వృద్ధులకు ఫారం 12డి అందిస్తున్న ఆర్డీవో రాములు

ఓట్ల లెక్కింపు కేంద్రం తనిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలోని ఐజా కళాశాలలో ఏర్పాటు చేయనున్న శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాములు, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి సందర్శించారు. ఎన్నికల ముగిసిన వెంటనే ఈవీఎం బాక్సులు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలు, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు రోజున చేపట్టాల్సిన ఏర్పాట్లపై కూడా సమీక్షించారు. మంచిర్యాల సీఐ రాజు, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ శ్రీహరి ఉన్నారు.

శైలపుత్రీ నమోస్తుతే

మంచిర్యాలఅర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



- వివరాలు 11లో

హోరాహోరీగా జోనల్ క్రీడలు!

- బెల్లంపల్లి, చెన్నూర్ గురుకులాల్లో పోటీలు

బెల్లంపల్లి/చెన్నూర్: జిల్లాలో జోనల్‌స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)విద్యాలయంలో నిర్వహిస్తున్న జోనల్‌స్థాయి స్పోర్ట్స్ మీట్ ఆదివారంతో తుదిదశకు చేరుకుంది. చెన్నూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ కళాశాలలో నిర్వహిస్తున్న 9వ జోనల్ క్రీడా పోటీలు పండుగలా సాగుతున్నాయి. బెల్లంపల్లిలో అండర్ -14, 17, 19 విభాగాల్లో నిర్వహించి నపలు అంశాల క్రీడా పోటీలు ఫైనల్‌కు చేరాయి. బెల్లంపల్లి రూరల్ సీఐ ఎస్.రాజ్‌కుమార్, సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ సైదులుతో కలిసి అండర్-19 విభాగంలో వాలీబాల్ ఫైనల్ పోటీలను ప్రారంభించారు.

బెల్లంపల్లిలో విజేతలు..

మూడో రోజు పలు క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. అండర్ -14 విభాగంలో క్యారమ్స్ డబుల్స్‌లో పోటీలు జరగగా ఈపోటీల్లో ఆసిఫాబాద్ క్రీడాకారులు ప్రథమ, ఏటూరు నాగారం క్రీడాకారులు ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. చెస్‌లో పోటీల్లో మంథని క్రీడాకారులు ప్రథమ, కోటపల్లి క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచారు. షాట్‌పుట్‌లో కె.సంకేత్(కాసిపేట)ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించగా, జె.వరుణ్‌సందేశ్(జైపూర్) వెండి పతకం, జె.సాయికుమార్(ఆసిఫాబాద్) కాంస్య పతకం గెలుచుకున్నారు. డిస్కస్‌త్రోలో కె.సంకేత్(కాసిపేట)బంగారు పతకం గెలుచుకోగా, కె.మల్లికార్జున్(ఏటూరు నాగారం) వెండి, జె.ఠాగూర్(ఏటూరు నాగారం) కాంస్య పతకం సాధించారు. 100 మీటర్ల పరుగుపందెంలో జె.వరుణ్ సందేశ్(జైపూర్) బంగారు పతకం, మదన్‌కుమార్(జైపూర్) వెండి పతకం, పి.విష్ణువర్ధన్(సిర్పూర్ -టీ) కాంస్య పతకం సాధించారు. ఆయా విభాగాల్లో నిర్వహించిన క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బెల్లంపల్లి వ్యాల్యూపిచ్ ఐటీ కంపెనీ మేనేజర్ జయచందర్, సుధాకర్, కృష్ణ మెడల్స్ ప్రదానం చేశారు. సోమవారం ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి.

చెన్నూర్‌లో విజేతలు..

చెన్నూర్ సాంఘిక సంక్షేమ పాఠశాలలో జరిగిన క్రీడాపోటీలను స్థానిక ఎస్సై వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. అండర్ - 14 చెస్‌లో ప్రథమ స్థానం లక్సెట్టిపేట, ద్వితీయ స్థానం కాటారం, క్యారమ్స్‌లో మొదటి స్థానం సిర్‌పూర్-టీ, రెండో స్థానం మందమర్రి, అండర్-17 చెస్‌లో మొదటి స్థానం లక్సెట్టిపేట, రెండోస్థానం ములుగు, క్యారమ్స్ మొదటి స్థానం మందమర్రి, రెండో స్థానం లక్సెట్టిపేట, అండర్ - 19 చెస్ పోటీల్లో మొదటి స్థానం మందమర్రి, రెండోస్థానం రామగుండం, క్యారమ్స్‌లో మొదటి స్థానం సిర్‌పూర్-టి, రెండోస్థానం చెన్నూర్‌కు చెందిన క్రీడాకారులు సాధించారు. విజేతలకు ఎస్సై వెంకటేశ్వర్‌రావు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



బెల్లంపల్లి : పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు



చెన్నూర్: క్యారమ్ ఆడుతున్న విద్యార్థినులు



చెన్నూర్: విజేతలకు మెడల్స్ అందజేస్తున్న ఎస్సై

క్లుప్తంగా

డైరెక్టర్‌కు పితృవియోగం

శ్రీరాంపూర్: సింగరేణి డైరెక్టర్(పర్సనల్, ఫైనాన్స్) ఎన్.బలరాం పితృ వియోగం పొందారు. ఆయన తండ్రి హనుమంత్‌నాయక్ (70) ఆదివారం అనారోగ్యంతో ఇంట్లోనే మరణించారు. వారి స్వగ్రామమైన మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని జడ్చర్లలో జరిగిన అంత్యక్రియలకు పలువురు కంపెనీ అధికారులు, నాయకులు తరలివెళ్లారు.

రూ.5 వేల విలువైన మద్యం పట్టివేత

దండేపల్లి: మండలంలోని నంబాలలో ఆదివారం బెల్టుషాపుపై దాడి చేసినట్లు ఎస్సై కుందారపు తెలిపారు. రూ.5వేల విలువైన మద్యం పట్టుకుని, వాటిని స్వాధీనం చేసుకుని, పోలీస్‌స్టేషన్‌లో పెట్టినట్లు తెలిపారు.

మద్యం నిల్వలు పట్టివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలోని సాయిప్రసన్న కిరాణా దుకాణంలో మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు హాజీపూర్ పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడిచేసి మద్యం నిల్వలు పట్టుకున్నారు. హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కె.చాంద్, కానిస్టేబుల్ రాజేందర్ కిరాణా దుకాణంలో తనిఖీ నిర్వహించగా క్వార్టర్ బాటిళ్లు 13, బీర్లు 7 లభించగా వీటి విలువ దాదాపు రూ.3,711 ఉంటుందన్నారు. దుకాణ యజమాని నారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

జైపూర్: మండలంలోని ఇందారం మామిడి తోటలో కోడి పందాల ఆట ఆడుతున్న వారిని ఎస్సై ఉపేందర్ అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఎస్సై కథనం ప్రకారం.. మామిడితోటలో కోడి పందాలు ఆడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. కోడి పందాల ఆట ఆడుతున్న ముగ్గురు పట్టుబడినట్లు, ఎనిమిది మంది పరారైనట్లు వివరించారు. వారి నుంచి మూడు బైకులు, రూ.1550 నగదు, ఒక కోడి పుంజు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారైన వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ప్రేమను అంగీకరించడం లేదని యువతి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: తన ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించడం లేదని మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో ఆదివారం జరిగింది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం తిలక్‌నగర్‌కు చెందిన సామల రామయ్య–లత దంపతుల కూతురు గ్రీష్మ (21) హైదరాబాద్‌లో ఎంబీఏ మధ్యలోనే ఆపేసింది. ప్రస్తుతం ఇంటివద్దనే ఉంటోంది. నాలుగేళ్లుగా స్థానిక యువకుడిని ప్రేమించింది. అయితే వీరి ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఈ విషయమై గ్రీష్మను పలుమార్లు మందలించారు. అయినా యువతిలో మార్పు రాలేదు. ఆదివారం ఇదే విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో తల్లిదండ్రులు తీవ్రంగా మందలించారు. ఆవేశానికి లోనైన గ్రీష్మ గదిలోకి వెళ్లి అటాచ్‌డ్ బాత్‌రూమ్‌లో ఉరేసుకుంది. ఎంతసేపైనా కూతురు బయటకు రాకపోవడంతో తల్లి లత వెళ్లి చూడగా అప్పటికే చున్నీతో ఉరివేసుంది. కొడుకు తేజతో కలిసి ఉరి తప్పించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మైసమ్మ కుంట వద్ద వెదురు బొంగుల వంతెన

అడవి ఒడిలో ఒక రోజు..!

- నేటి నుంచి కవ్వాల్‌లో జంగల్ సఫారీ..
- 4 నెలల తర్వాత తిరిగి ప్రారంభం
- పెరిగిన సఫారీ చార్జీలు



అటవీ శాఖ సఫారీ మొదలయ్యే గోండుగూడ గేట్ నంబర్ 1

జన్నారం: ఉమ్మడి జిల్లాలో ప్రకృతి అందాలకు కొదువలేదు. ఎంత చూసినా తనివితీరదు.. ఇక కవ్వాల్ అభయారణ్యంలో అయితే రోజంతా చూసినా సమయం సరిపోదు. ప్రకృతి ఒడిలో విహరించే ప్రేమికుల కోసం పర్యాటక, అటవీశాఖ కవ్వాల్ అభయారణ్యంలో జంగల్ సఫారీ నిర్వహిస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో జూన్‌లో సఫారీ నిలిపివేశారు. సోమవారం నుంచి సఫారీ పునఃప్రారంభిస్తున్నారు. దీంతో పర్యాటకులకు కవ్వాల్ అడవి అందాలు తిలకించే అవకాశం లభించింది.

'హరిత'లో బస..

జన్నారం మండల కేంద్రంలో ఉన్న పర్యాటక శాఖ హరిత రిసార్ట్‌లో బసచేసి కవ్వాల్ అటవీ అందాలు తిలకించేందుకు సఫారీ ద్వారా అడవి ప్రాంతంలో పర్యటిస్తారు. ఈ క్రమంలో పర్యాటక శాఖ అధ్వర్యంలో జంగిల్ సఫారీ ఏర్పాటు చేశారు. ఈ సఫారీ ద్వారా కవ్వాల్ టైగర్‌జోన్ ప్రాంతంలోని జన్నారం అటవీ డివిజన్ ప్రాంతంలోని పలు ప్రాంతాలను సఫారీ ద్వారా పర్యటకులను చూపిస్తారు. ఏటా అక్టోబర్ నుంచి జూన్ వరకు అటవీశాఖ అధికారులు అనుమతి ఇస్తున్నారు. దీంతో పర్యటకులను అడవిలో సుమారుగా 15 కి.మీ దూరం సఫారీలో వెళ్లే అవకాశం ఉంటుంది. అడవిలో ప్రయాణించే పర్యాటకులు వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉంటుంది.

ఇతర రాష్ట్రాల నుంచి రాక..

అడవి అందాలు, అడవిలోని వన్యప్రాణులు చూసేందుకు జన్నారంలోని పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన హరిత రిసార్ట్‌కు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాల నుంచి పర్యటకులు ఇక్కడికి వస్తుంటారు. రాత్రి రిసార్ట్‌లో బస చేసిన పర్యాటకులు ఉదయం 6 గంటలకే అడవిలోకి వెళ్లేదుకు సఫారీ రెడీగా ఉంటుంది. అడవిలో సుమారుగా 15 కిలోమీటర్ల దూరం తీసుకెళ్తారు. అడవిలో ప్రయాణిస్తున్న సమయంలో చుక్కల దుప్పులు, సాంబర్లు, ఇతర వన్యప్రాణులు కనిపిస్తాయి. ఎప్పుడూనిపచ్చని అడవులు, స్వచ్ఛమైన గాలి, వన్యప్రాణుల పరుగులు పర్యాటకులకు, ప్రకృతి ప్రేమికులకు కొత్త అనుభూతినిస్తాయి. జలపాతాలు, పక్షుల కిలకిలారావాలు, వన్యప్రాణుల పరుగులు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ప్రతీరోజు ఉదయం 6 నుంచి 10.30 గంటల వరకు , సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సఫారీ ద్వారా అడవుల్లో తిప్పుతారు. అడవిలో ఈసారి బైసన్‌కుంట ప్రాంతంలో అటవీశాఖ అధ్వర్యంలో ప్రత్యేక ప్రాంతంలో పర్యటించేందుకు అనుమతి లభించింది. అదే విధంగా మల్యాల వాచ్‌టవర్ వరకు పర్యటకులను తీసుకెళ్తారు.

కాటేజీల వివరాలు:

జన్నారం హరిత రిసార్ట్‌లో పర్యాటకుల కోసం కాటేజీలను ఏర్పాటు చేశారు. ఇందులో 6 నాన్‌ఏసీ , 8 ఏసీ గదులతోపాటు ఒక డార్మెటరీ హాల్ ఉంది. సోమవారం నుంచి గురువారం (వీక్ డేస్‌లలో) నాన్ ఏసీ గదికి రూ.1,064, ఏసీ గదికి రూ.1,624, డార్మెటరీకి రూ.1,600, శుక్ర, శని, ఆదివారాల్లో (వీకెండ్ డేస్‌లలో) నాన్ ఏసీ రూ.1,176, ఏసీ గదికి రూ.1,792, డార్మెటరీకి రూ.1800 చార్జి చెల్లించాల్సి ఉంటుంది. హరిత రిసార్ట్‌లో రెస్టారెంట్ సౌకర్యం ఏర్పాటు చేశారు.

సఫారీ చార్జీల పెంపు..



లగ్జరీ సఫారీ వాహనం

అయితే గతంతో పోలిస్తే ప్రస్తుతం సఫారీ చార్జీలను అటవీశాఖ పెంచింది. సఫారీ వాహనాల సంఖ్య కూడా పెంచింది. గతంలో కేవలం రెండు సఫారీ వాహనాలు మాత్రమే నడిపించింది. ఈ సంవత్సరం కొత్తగా ఐదు వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. గతేడాది వరకు ఒక వాహనానికి రూ.2 వేలు చార్జి చేసేవారు. ఒక వాహనంలో ఆరుగురిని తీసుకెళ్లేవారు. అదనంగా ఎక్కితే ఒక్కరికి రూ.350 చొప్పున వసూలు చేసేవారు. ఇందులో పర్యాటక శాఖ పర్యావణ రుసుము కింద రూ.500 అటవీశాఖకు చెల్లించేవారు. ఈసారి సఫారీ చార్జీ రూ.500 పెరిగింది. ఒక వాహనానికి రూ.2,500 వసూలు చేయనున్నారు. అదనంగా ఉంటే ఒక్కరికి రూ.400 వసూలు చేస్తారు. పర్యావరణ చార్జీ కింద పర్యాటక శాఖ అటవీశాఖకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. కొత్తగా వచ్చిన లగ్జరీ వామనాలకు రూ.3,500 వసూలు చేస్తారు. అదనంగా ఉంటే.. ఒక్కరికి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. వీకెండ్‌లో రూ.4 వేలు చార్చి చేస్తారు.

సౌకర్యాలు కల్పిస్తాం



కవ్వాల్ అటవీ అందాలను చూసేందుకు హైదరాబాద్, ముంబయి, ఢిల్లీతోపాటు ఇతర పట్టణాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. వారి కోసం ఇక్కడ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. బస చేసేందుకు కాటేజీలు, భోజన సౌకర్యం, సఫారీ సౌకర్యం ఉంది. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం పర్యటకులను అడవిలోకి తీసుకెళ్తాం. అడవిలో అందమైన ప్రదేశాలు చూడవచ్చు. సఫారీ చార్జీలు, పర్యావరణ అనుమతి కోసం చార్జీలు పెంచాం. పర్యాటకులు సహకరించాలి.– సుదనబోయిన వీరేందర్, మేనేజర్ పర్యాటక శాఖ

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చార్జీలు పెంపు



వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కవ్వాల్ అడవులు ఆహ్లాదం పంచుతాయి. గతంలో కంటే వన్యప్రాణుల సంఖ్య పెరుగడంతో వన్యప్రాణులు పర్యాటకులకు విరివిగా కనిపిస్తూ కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. అయితే సఫారీ చార్జీలు ప్రస్తుతం పెరిగాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చార్జీలు పెంచడం జరిగింది. పర్యాటకుల కోసం కొత్తగా అటవీశాఖ ఐదు లగ్జరీ సఫారీ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. – హఫీజొద్దీన్, అటవీ రేంజ్ అధికారి

తొలి అడుగు పడింది..!

- సిక్కింలో పర్వతారోహణ శిక్షణ పూర్తిచేసుకున్న కార్తీక్



మంచు కొండలపై త్రివర్ణ పతాకంతో కార్తీక్

కెరమెరి(ఆసిఫాబాద్): ఎవరెస్టు శిఖరం అధి రోహించేందుకు మారుమూల గ్రామానికి చెందిన పేద విద్యార్థి తొలిఅడుగు విజయవంతంగా పడింది. సిక్కిం రాష్ట్రంలో 22 రోజు లుగా కొనసాగిన శిక్షణ పూర్తయింది. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం కెలి– కె గ్రామానికి చెందిన గిత్తే రుక్మాజీ, ఇటాబాయి దంపతుల కుమారుడు కార్తీక్ ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలోని మైనార్టీ గురుకులంలో ఇంటర్ చదువుతున్నాడు. సిక్కిం రాష్ట్రంలోని నామ్‌చా జిల్లాలో సెప్టెంబర్ 18 నుంచి అక్టోబర్ 10 వరకు 30 మందికి పర్వతారోహణ శిక్షణ అందించారు. ఇందులో తెలంగాణ నుంచి పాల్గొన్న నలుగురిలో కార్తీక్ ఒకరు. వీరి శిక్షణ విజయవంతంగా పూర్తయింది.

దశల వారీగా ట్రైనింగ్

పర్వతారోహణకు దశల వారీగా ట్రైనింగ్ అందించారు. ముందుగా సెప్టెంబర్ 18 నుంచి 21 వరకు చంచోయ్ అడవుల్లో 15 కిలోల బ్యాగుతో ట్రెక్కింగ్‌పై శిక్షణ ఇచ్చారు. తర్వాత 25 వర కు అదే అడవుల్లో టెన్ డౌన్ హిల్ అనే ప్రాంతంలో 9,600 అడుగుల ఎత్తులో 20 కిలోమీటర్ల దూరం వరకు ట్రయల్ ట్రెక్ చేయించారు. అనంతరం రెండు రోజులు ఎవరెస్టు అధిరోహరణకు కావాల్సిన ఆరోగ్యం అవగాహన కల్పించారు. ఆ తర్వాత 14 వేల అడుగులు, 15 వేల అడుగులు, 17వేల అడుగుల ఎత్తు వద్ద అవసరమైన శిక్షణ అందించారు. ఈ నెల 9న 5,300 అడుగుల ఎత్తులో ఉన్న మంచుకొండలను ఎక్కారు. ఈ సందర్భంగా కార్తీక్ మంచుకొండలపై జాతీయ జెండాను ఎగురేశారు. అలాగే 'సాక్షి' క్లిప్పింగ్ చూపించి అభిమానాన్ని చాటుకున్నాడు. ఆదివారం సిక్కింలోని చెంచాయ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ హిమాలయ అడ్వేంచర్ ఫర్ ఎకో టూరిజం డైరెక్టర్ కాజి షెర్పా కార్తీక్‌ను బ్యాడ్జీతో సత్కరించారు.

'సాక్షి'కి ధన్యవాదాలు

తన ఆశయం, పేదరికం గురించి 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనాలలకు ఎమ్మెల్యే ఆత్రం సక్కుతోపాటు ఎస్సై విజయ్, వంజారి నాయకుడు వెంకట్ ముండే ఆర్థికసాయం అందించారు. దీంతో నేను విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నా. 'సాక్షి'కి ధన్యవాదాలు. శిక్షణతో మౌంట్ ఎవరెస్టు, కిలిమంజారో తదితర పర్వతాలు అధిరోహించేందుకు అర్హత సాధించా. – గిత్తే కార్తీక్

వేర్వేరు చోట్ల నగదు పట్టివేత

వాంకిడి(ఆసిఫాబాద్): మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన వాంకిడి మండలం గోయగాం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.1.50 లక్షలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన సునీల్ పద్మవార్ కారులో సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేసినట్లు సిర్పూర్(యూ) ఎస్సై రాజు తెలిపారు. అయితే కుటుంబ సభ్యులతో కలిసి పెళ్లి షాపింగ్ కోసం వేములవాడకు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారని సునీల్ పద్మవార్ తెలిపారు. రూ.50వేల కంటే ఎక్కువ డబ్బుతో బయటికి వెళ్లాల్సి వస్తే సంబంధిత పత్రాలు తీసుకెళ్లాలని పోలీసులు సూచించారు.



గోయగాం వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రూ.5లక్షలు సీజ్

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలంలోని ఇందాని క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సరైన ఆధారాలు లేని రూ.5లక్షలు పట్టుకున్నామని ఎస్సై సాగర్ తెలిపారు. ఆసిఫాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తున్న కారులో సత్తికుమార్, రాఘవన్ వద్ద రూ.5లక్షలు గుర్తించి సీజ్ చేశామన్నారు. వీరు రాజస్తాన్ నుంచి చెన్నైకి వెళ్తున్నారని పేర్కొన్నారు.

నిబంధనలు పాటించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని రెబ్బెన సీఐ నరేందర్ అన్నారు. మండలంలోని గోలేటి సీహెచ్‌పీ వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద సరైన పత్రాలు లేకుండా ఓ వాహనదారుడు తీసుకెళ్తున్న రూ.51వేలను సీజ్ చేశారు. ఆయన వెంట ఎస్సై చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

మందమర్రిలో రూ.నాలుగు లక్షలు..


మందమర్రిరూరల్: ఎటువంటి ఆధారాలు లేకుండా మందమర్రి నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న కారులో రూ.నాలుగు లక్షల నగదును పట్టుకున్నట్లు సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి ఎస్సై చంద్రకుమార్, హరిశేఖర్ జాతీయ రహదారిపై తనిఖీ చేస్తుండగా కారు ఆపి తనికీ చేయగా, నగదు పట్టుపడిందన్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి, తదుపరి చర్యలకు ఫ్లయింగ్ స్క్వాడ్ భరత్‌కు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రూ.6.90 లక్షలు

కాగజ్‌నగర్‌టౌన్: ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును కాగజ్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్స్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎం.రామకృష్ణ వద్ద రూ.6.90 లక్షల నగదు లభించినట్లు కాగజ్‌నగర్‌టౌన్ ఎస్‌హెచ్‌వో స్వామి, ఎస్సైలు అంజయ్య, శ్రీకాంత్ తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. డబ్బును ఎన్నికల వ్యయ పరిశీలక కమిటీకి అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

జైపూర్‌లో రూ. లక్ష స్వాధీనం

జైపూర్: మండలంలోని ఇందారం చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా కారులో మంచిర్యాల వైపు వెళ్తున్న శనిగారపు అశోక్ అనే వ్యక్తి వద్ద నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో, తదుపరి చర్యల నిమిత్తం వాటిని ఎఫ్ఎస్‌టీ టీంకి అప్పగించామని ఎస్సై తెలిపారు.



నగదు స్వాధీనం చేసుకున్న ఎస్సై

ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం సీవిజిల్

- యాప్ రూపొందించిన ఈసీ
- ఎన్నికల్లో జరిగే అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదుకు అవకాశం
- నిమిషాల వ్యవధిలో ఫిర్యాదుదారుడికి సమాచారం



సీవిజిల్ యాప్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల్లో అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీవిజిల్ యాప్ ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. ప్రస్తుతం ఈ యాప్ ఆధునీకరణతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం చేసింది. అక్రమాలకు సంబంధించిన ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 100 నిమిషాల వ్యవధిలో ఫిర్యాదుదారుడికి సమాచారం తెలియజేస్తారు. జిల్లా ఎన్నికల అధికారితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం చేరుతుంది. ఎవరైనా కోడ్ ఉల్లంఘించినా, డబ్బు, మద్యం, బహుమతులు వంటివి ఇచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల ప్రచారంలో అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్ వాడడం, ఇతర నిబంధనలు ఉల్లంఘించినా, కుల, మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ర్యాలీలు తీసినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. ఈ యాప్ ద్వారా ఫిర్యాదు అందిన 10 నిమిషాలలో ఎన్నికల అధికారులు ఘటనాస్థలికి చేరుకుని 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటారు.

పనిచేసే విధానం ఇలా..

నాయకులు డబ్బు, మద్యం లేదా వస్తువుల రూపంలో ఓటర్లకు ఇచ్చే క్రమంలో ఫొటోలు, వీడియోలు తీసి ఘటనా స్థలం నుంచి సీవిజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వెంటనే ఆ దృశ్యాలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కి చేరుతాయి. అధికారులు అప్రమత్తమై ఘటనాస్థలికి చేరుకుని ఆయా నాయకులపై చర్యలు తీసుకుంటారు. ఈ యాప్ ద్వారా అందే సమాచారం బలమైన సాక్ష్యంగా పనిచేస్తుంది. అవసరమైతే ఆయా అభ్యర్థుల సభ్యత్వాన్ని రద్దు చేసినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. ఫొటోలు, లేదా వీడియోలు పంపిన వెంటనే ఫిర్యాదుదారులు ఏ లొకేషన్ నుంచి వాటిని పంపించారో అధికారులకు స్పష్టంగా తెలుస్తుంది. దీంతో వెంటనే చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతారు.

పోలీస్ కంట్రోల్‌రూంకు అనుసంధానం

సీవిజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులు, సమాచారం ఎన్నికల అధికారులతో పాటు నేరుగా పోలీస్ కంట్రోల్ రూంకు కూడా అందుతాయి. ఫ్లయింగ్ స్క్వాడ్లు, సర్వైలెన్స్ కమిటీలు, రిజర్వ్ టీంలు అప్రమత్తం అవుతాయి. వెంటనే లొకేషన్‌కు చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. అంతేకాదు అవినీతికి పాల్పడిన అభ్యర్థులపై ఏవిధమైన చర్యలు తీసుకున్నారన్న సమాచారాన్ని సైతం ఫిర్యాదు చేసిన వారికి 100 నిమిషాల్లో యాప్ ద్వారా తెలియజేస్తారు.

నిజాయతీ పరులకు నేస్తం...

సభలు, సమావేశాల్లో ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘించేలా ప్రసంగించినా, ఏ అక్రమాలకు పాల్పడినా వెంటనే రికార్డు చేసి అన్యాయాన్ని అడ్డుకునేందుకు సీవిజిల్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ యాప్‌ను ఎన్నికల సంఘం 2018లో అందుబాటులోకి తెచ్చింది.

తప్పుడు సమాచారం స్వీకరించదు..

యాప్‌ను తప్పుదోవ పట్టించే వీలులేదు. ఈ యాప్‌ను ఘటన జరిగిన స్థలం నుంచే వినియోగించాలి. మరో చోటుకు వెళ్లి తీసిన ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదు. పాత ఫొటోలతో ఎదుటి వారిపై ఫిర్యాదు చేసినా తీసుకోదు.

బెల్లంపల్లిలో రూ.లక్ష పట్టివేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి పరిధిలో రోజువారీగా డబ్బులు పట్టుబడుతున్నాయి. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రావడంతో ఎన్నికల అధికారులు, పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి ఓ వ్యక్తి వద్ద తాళ్లగురిజాల పోలీసులు రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారి కన్నాల హన్మాన్ విగ్రహం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో ఓ వాహనంలో వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన సునావత్ జబ్బీర్ అనే వ్యక్తి వద్ద రూ.లక్ష లభించాయి. వీటి తాలూకు జబ్బీర్ వద్ద ఎలాంటి పత్రాలు లభించకపోవడంతో నగదును జప్తు చేసి, పోలీసులు బెల్లంపల్లి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్‌టీ) ఎల్హూరి సురేఖకు అందజేయగా, ఆమె నగదును సీజ్ చేశారు. కార్యక్రమంలో తాళ్లగురిజాల ఎస్సై నరేష్ , ఏఎస్సై రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.



నగదు ఎఫ్ఎస్‌టీ అధికారికి అందిస్తున్న ఎస్సై

బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంట్లో సోదాలు

మంచిర్యాల టౌన్ : బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఇంట్లో ఎన్నికల అధికారులు ఆదివారం రాత్రి సోదాలు నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన నియమావళికి విరుద్ధంగా పంపిణీ కోసం పెద్ద ఎత్తున చీరల స్టాక్ ఉందన్న సమాచారంతో ఫ్లయింగ్ స్క్వాడ్ రాజేందర్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేశారు. 720 చీరలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో పట్టణ సీఐ రాజు, ఎస్సై రాజేందర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల సమయంలో రఘునాథ్ ఇంట్లో లేరు. ఆయన సతీమణి స్రవంతి మాట్లాడుతూ తాము ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా ఉండేందుకే చీరలను పంపిణీ చేయకుండా గదిలో భద్రపర్చి తాళం వేశామని తెలిపారు. కోడ్ వచ్చాక ఒక్క చీర కూడా పంచలేదని పేర్కొన్నారు.



చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య..?

చెన్నూర్: పట్టణంలోని పెద్ద చెరువులో ట్రాక్టర్ డ్రైవర్ దూకి ఆత్మహత్య చేసుకున్నాడనే అనుమానాన్ని బాధితుడి కుటుంబ సభ్యులు వ్యక్త పరుస్తున్నారు. బంధువుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మహంకాళివాడకు చెందిన దబ్బెట రాజమల్లు (30) అనే వ్యక్తి పట్టణంలోని ప్రముఖ వ్యాపారి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజమల్లు ఆదివారం రాత్రి మద్యం సేవించి పెద్ద చెరువు వైపు వెళ్లడాన్ని గమనించిన వ్యక్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు పెద్ద చెరువు వద్దకు వచ్చి చూడగా, చెరువు ఒడ్డున రాజమల్లు చెప్పులు ఉన్నాయి. మనిషి కన్పించడం లేదు. రాజమల్లు చెప్పులు ఒడ్డునే వదిలీ, చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక సాక్షులు ఎవరూ లేకపోవడంతో రాజమల్లు మిస్సింగ్‌పై అనుమానం వ్యక్తం అవుతోంది. రాజమల్లు ఆత్మహత్య చేసుకున్నాడా, జీవించి ఉన్నాడా అనే విషయం తెలియాలంటే గాలింపు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రాత్రి కావడంతో జాలర్లు సోమవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఈ విషయమై సీఐ వాసుదేవరావును వివరణ కోరగా సీసీ కెమెరా ఫుటేజీ గమనించగా, రాత్రి సమయంలో ఒక వ్యక్తి చెరువు వైపు వెళ్లడం కన్పించింది. చెరువులో దూకేది కన్పించలేదు. గాలింపు చర్యలు చేపడితే నిజాలు వెలుగులోకి వస్తాయి. ఇప్పటి వరకు కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. కుటుంబ సభ్యులు పెద్దచెరువు వద్దనే పడిగాపులు కాస్తున్నారు.



చెన్నూర్ పెద్ద చెరువు వద్ద రోదిస్తున్న బంధువులు